

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,75,424లు, బంగారం 2.9గ్రాములు, వెండి 20గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కొనసాగిన నిరసనలు

-8లో



మల్కన్‌గిరి చేరుకున్న వన దేవతామూర్తులు

-8లో

న్యూస్‌రీల్

మందిర ప్రతిష్టకు హాజరైన ఎంపీ



రాధా దామోదర్ మందిరంలో ఎంపీ రమేష్ మాఝి

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి దిగి గ్రామంలో రాధా దామోదర మందిర ప్రతిష్ట కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఇతర సదుపాయాల కోసం వాకబు చేశారు. నిర్మాణాల కోసం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీని మందిర కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో బీజు జనతాదల్ సీనియర్ నాయకుడు నారాయణ పాత్రొ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మంజులా మాఝి, తారిఖ్ హసన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాం డీఎఫ్‌ఓగా సోని కోఖర్



బాధ్యతలు స్వీకరిస్తున్న సోని కోఖర్

బరంపురం: గంజాం జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌ఓ)గా సోని కోఖర్ శనివారం విధుల్లో చేరారు. ఈ మేరకు జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కార్యాలయంలో ఇప్పటి వరకు డీఎఫ్‌గా వ్యవహరించిన అమూల్యకుమార్ నాయక్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఆలివ్ రీడ్లే తాబేళ్ల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రుశికుల్యా నదీ, బంగాళాఖాతం ముఖద్వారం గోకురకుద, పనిబొందో, పుర్ణబొందో తీరాల్లో గత వారం రోజుల్లో 6,87,226కి పైగా తాబేళ్లు గుడ్లు పెట్టాయని ప్రకటించారు.

అనుమానాస్పదంగా కాకులు మృతి



చెట్టు కింది కుప్పలుగా పడి ఉన్న కాకుల కళేబరాలు

బరంపురం: గంజాం జిల్లా దిగపండి బ్లాక్ పరిధి టికరపడా పంచాయతీలోని పసిబొందో గ్రామంలో శనివారం వింత వ్యాధి సోకి 35కి పైగా కాకులు మృతిచెందాయి. దీంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పశుసంవర్ధక, అటవీశాఖ అధికారులు పసిబొందో గ్రామానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతిచెందిన కాకులను గ్రామ శివారులో పూడ్చిపెట్టారు. వాటి రక్త నమూనాలను సేకరించి, మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు భోపాల్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ లేబరేటరీకి పంపినట్లు జిల్లా ముఖ్య పశుసంరక్షణ అధికారి(సీడీవీఓ) త్రినాథ్ నాయక్ తెలిపారు.

మహిళా దినోత్సవంపై మావోయిస్టుల పిలుపు

మల్కన్‌గిరి: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరుతో శనివారం ఓ కరపత్రం విడుదల చేశారు. ఇందులో ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గ్రామాల్లో శ్రామిక మహిళా దినోత్సవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహిళా సమానత్వాన్ని సాయుధ పోలీసు ద్వారా అడ్డుకోవడంతో పాటు భూస్వామ్య, పెట్టుబడిదారుల, పితృస్వామ్య అణచివేతకు దారి తీస్తున్నారని మండిపడ్డారు. దీని ప్రభావంతో మహిళలు పోరాట స్ఫూర్తిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీటికి అడ్డుకట్టు వేసేలా శ్రామిక మహిళా దినోత్సవం జరుపుకోవాలని కోరారు.

తరగతులు బహిష్కరించిన విద్యార్థులు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలో 127 ఏళ్ల పురాతనమైన కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలకు విశ్వవిద్యాలయం హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శనివారం ఉదయం తరగతులు బహిష్కరించారు. కళాశాల ఆవరణలో నిరసన చేట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ అజిత్‌కుమార్ త్రిపాఠి వినతిపత్రం అందజేశారు.

విలువల బోధనలు తప్పనిసరి

- విద్యాభ్యాసంలో ఆధ్యాత్మిక అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలి
- సీఎం నవీన్ పట్నాయక్
- కెంజొహర్ జిల్లాలో ఉత్కళ్ గౌరవ్ అంతర్జాతీయ పాఠశాల ప్రారంభం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: విద్యా బోధనలో ప్రజల భావోద్వేగ, ఆధ్యాత్మిక అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. కెంజొహర్ జిల్లా బెరునపపడి ప్రాంతంలో ఉత్కళ్ గౌరవ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సలీల్ చతుర్వేది మార్గదర్శకత్వంలో డాక్టర్ ప్రదీప్ సేథి సంస్థను స్థాపించారని తెలిపారు. ప్రత్యేకమైన విలువలతో కూడిన విద్యా బోధన పట్ల చొరవ చూపిన వ్యవస్థాపకులు, మార్గదర్శకులను అభినందించారు. ఇది భావి తరాలకు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును లక్ష్యంగా చేసుకునే విద్యా విధానమని పేర్కొన్నారు. స్వామి యోగానంద తత్వశాస్త్రం విలువలతో కూడిన బోధనతో ఈ పాఠశాల పని చేస్తుందన్నారు. సామరస్య పూర్వకమైన జీవితం ప్రోత్సహించేందుకు సంస్థలో ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్యా బోధనతో బాలల్లో మేధస్సు పెంపొందించడం లక్ష్యంగా సూచించారు.

లక్ష్యం.. అభినందనీయం..

పాఠశాల ఏర్పాటు వెనుక ఉన్న లక్ష్యాన్ని అభినందించిన సీఎం.. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకుని సమగ్ర పురోగతి సాధించేందుకు ఆధునిక విద్య దోహదపడుతుందని తెలిపారు. వీటితో మానవుల భావోద్వేగ, ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి, నేటి తరానికి విద్యా బోధన కల్పించడం అనివార్యమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగర ప్రాంతాల నుంచి ప్రతి బిడ్డా ఆధ్యాత్మిక దృక్పథంలో భౌతిక సామరస్య భావాలతో ప్రపంచ నాగరికతకు మార్గదర్శకుల్ని తీర్చిదిద్దే ఆదర్శ సంస్థల ఏర్పాటు పట్ల ఆసక్తితో అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

3వేల పాఠశాలల్లో 5టీ అభివృద్ధి..

ఆరోగ్యవంతమైన పర్యావరణంలో విద్యా బోధనకు అనుకూలమైన వనరులు కల్పించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మోస్కూల్ కార్యక్రమం దోహదపడుతుందని సీఎం నవీన్ పట్నాయక్ ప్రకటించారు. పూర్వ విద్యార్థులు విద్యా బోధన పొందిన పాఠశాలల పునరుద్ధరణ, బహుముఖ పురోగతికి మోస్కూల్ కార్యక్రమానికి వారధిగా వ్యవహరించడం విశేషంగా పేర్కొన్నారు. విద్యారంగం బహుముఖ ప్రగతి ప్రక్రియలో సామాజిక భాగస్వామ్యం క్రమంగా ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. సమష్టి కృషితో రాష్ట్రంలో బాలలకు ప్రపంచ శ్రేణి విద్యను అందించడం సాధ్యమవుతున్న సంకేతాలు బలపడుతున్నాయని తెలిపారు.



ఉత్కళ్ గౌరవ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ వేదికపై అతిథి ప్రముఖులు

స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, ఆధునిక లైబ్రరీలు, లేబొరేటరీలు, క్రీడల సౌకర్యాలతో 4వేల కంటే ఎక్కువ పాఠశాలల పునరుద్ధరణ సాధ్యమైనట్లు వెల్లడించారు. 5టీ పాఠశాల పరివర్తన కింద సుమారు 3వేల పాఠశాలలు పురోగతి బాటలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర పాఠశాలలు–సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్ దాస్ మాట్లాడుతూ గ్రామీణ బాలలకు నాణ్యమైన విద్యను ప్రోత్సహించడంలో ఒడిశా ఆదర్శ విద్యాలయాలు సత్ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 314 ఒడిశా ఆదర్శ విద్యాలయాల్లో 25వేల మంది చిన్నారులకు నాణ్యమైన విద్యా బోధన కల్పిస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో కెంజొహర్ పార్లమెంట్ సభ్యురాలు చంద్రాణి ముర్ము, ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్, ఉత్కళ్ గౌరవ్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపక సభ్యులు పాల్గొన్నారు.

బిజూ జయంతి నుంచే సేవలు

- రంగైలుండా–భువనేశ్వర్ మధ్య విమాన సర్వీసులు



సత్య మహరాణా రూపొందించిన బీజూ సైకతశిల్పం

భువనేశ్వర్: పైలట్ దిగ్గజం బిజూ పట్నాయక్ జయంతి పురస్కరించుకుని బరంపురం రంగైలుండా ఎయిర్‌స్ట్రిప్ నుంచి భువనేశ్వర్‌కు విమానయాన సదుపాయం అందుబాటులోకి రానుంది. ఈనెల 5నుంచి ఈ సేవలు లాంఛనంగా ప్రారంభించేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర వాణిజ్య, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఉషా పాఢి ప్రత్యక్షంగా ఈ పనులు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 8నుంచి రోజూ ఉదయం 9:30 గంటలకు భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి విమానం బయలుదేరి, ఉదయం 10:20 గంటలకు రంగైలుండా ఎయిర్‌స్ట్రిప్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 10:40 గంటలకు రంగైలుండాలో బయలుదేరి, 11:30 గంటలకు స్థానిక బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగుతుంది.

ఆకట్టుకున్న సైకత శిల్పం..

బరంపురం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత బిజూ పట్నాయక్ 108వ జయంతి సందర్భంగా నగరంలోని బెజ్జిపూర్ నీలకంఠ నగర 3వ లైన్‌కు చెందిన సైకతశిల్పి సత్యనారాయణ మహారణ తన కళా నైపుణ్యంతో నివాళులర్పించారు. ఇసుకతో బిజూ శిల్పాన్ని తీర్చిదిద్ది, తన అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే ప్రపంచీకరణ సమాజంలో పర్యావరణాన్ని రక్షించుకోవాలని, లేకుంటే మనవ మనుగడకే ప్రమాదమని ఇందులో పేర్కొన్నారు.

అంబాగుడ బస్టాండ్ అభివృద్ధికి చర్యలు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని అంబాగుడ బస్టాండ్‌కు రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు చేస్తున్న డిమాండ్ త్వరలోనే నేరవేరుతుందని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తెలిపారు. జయపురం సమితి అంబాగుడలో శుక్రవారం సాయంత్రం ఆయన రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 600 మీటర్ల మేర చేపట్టనున్న పనులకు రూ.కోటి 16 లక్షల మంజూరైనట్లు ప్రకటించారు. తాజా నిర్మాణంతో రోడ్డుపై మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. 26వ జాతీయ రహదారిలో అంబాగుడ కూడలికి ఎంతో ప్రాధాన్యత ఉందని, అయితే బస్టాండ్‌ను చేరుకునేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. ప్రస్తుత పనులతో సమస్యలకు చెక్ పెట్టవచ్చని వివరించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర సామంతరాయ్, వ్యామకేశ్ బెహరా, సోను నచిక, బి.మహాపాత్రొ, రాజు మదల, శరత్ తురియ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

ఘుమఘుమలాడిన పోటీలు



మేయర్ సంఘమిత్రతో బీఎంసీ మహిళా సిబ్బంది

బరంపురం: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఆధ్వర్యంలో ఈనెల 31న జరగనున్న స్వపరిపాలన దినోత్సవాల సందర్భంగా బీఎంసీ కార్పొరేటర్ల మధ్య వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా బీఎంసీ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగినుల మధ్య ఏర్పాటు చేసిన వంటల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఒకరికొకరు పోటీగా పాల్గొని.. ఘుమఘుమలాడే కోవా పాయసం, చిల్లీ చికెన్, మొక్కజొన్న కూర, చేపలు వేపుడు, రొయ్యల ఇగురు, వివిధ వంటకాలు తయారుచేసి, తమ ప్రతిభను చాటుకున్నారు. ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి హాజరై, వంటకాలను రుచి చూడటంతో పాటు విజేతలను నిర్ణయించారు.



వంటకాలను రుచిచూస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర

నవరంగపూర్‌లో జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి



గిరిజనులు పెట్టిన భోజనాన్ని ఆరగిస్తున్న తరీఖ్ అహ్మద్

కొరాపుట్: జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు తరీఖ్ అహ్మద్ ఖారా నవరంగ్‌పూర్ జిల్లాలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆహర భద్రతా హక్కుచట్టం అమలు తీరుపై క్షేత్ర పర్యటన చేశారు. అగ్నిపూర్, దస్‌పూర్, సింధిగాం గ్రామాల్లో గిరిజనులతో సంభాషించారు. నవరంగ్‌పూర్ పట్టణం సరిహద్దులో మొక్కజొన్న విక్రేత మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జొరిగాం సమితిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ రైతులతో మాట్లాడారు. అనంతరం గిరిజన సంప్రదాయం ప్రకారం వారిచ్చిన ఆహారాన్ని వీధిలో కూర్చుని ఆరగించారు. కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, జయపురం మున్సిపల్ చైర్మన్ నోరి మహంతి, ఏఐసీసీ సభ్యురాలు మనసా త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి, జెడ్పీ సభ్యురాలు లిపికా మాఝి తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపానికి ప్రత్యమ్నాయ ఏర్పాట్లు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కమలోచన్, ఎమ్మెల్యే మనోహర్

కొరాపుట్: వేసవి తాపం నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని నవరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన అత్యవసర సమావేశంలో వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్ష జరిపారు. జిల్లావ్యాప్తంగా పూడుకుపోయిన బావులను పునరుద్ధరించాలని, తాగునీటి బోర్లకు మరమ్మతుల చేయాలని ఆదేశించారు. విద్యాలయాలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా తాగునీటి వసతి కల్పించాలన్నారు. జిల్లాలో నీటి ఎద్దడి గల ప్రాంతాలను గుర్తించి, రోజూ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ నిల్వ ఉంచాలని, ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎండలో కూలి పనులు చేయిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. కాల వైశాఖి ఆకస్మిక ప్రభావాన్ని తట్టుకొనే విధంగా సహాయక బృందాలను సంసిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో, ఏడీఎం భాస్కర్ రైతా, అత్యవసర విభాగ అధికారి మౌసమి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి..

పర్లాకిమిడి: వేసవిలో వడదెబ్బ ప్రభావాన్ని అరికట్టేందుకు ముందస్తుగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లింగరాజ్ పండా సూచించారు. ఇప్పటికే జిల్లాలో ఎండలు రోజురోజుకు పెరిగిపోతున్న తరుణంలో ప్రతి సమితి, మున్సిపల్, ఎన్ఏసీ స్థాయిలో తాగునీటి చలివేంద్రాలు, సీహెచ్‌సీల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకు ఆర్ శెట్టి భవనంలో జరిగిన కార్యక్రమంలో కాశీనగర్ ఎన్ఏసీ కాశీనగర్ బ్లాక్ అధికారులు, ఏడీఎం డాక్టర్ మహ్మద్ అలీ, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సంగ్రాంశేఖర పండా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఎం సంగ్రాంశేఖర పండా

గ్యాస్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డుపై ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

కొరాపుట్: గ్యాస్ సిలీండర్ల లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. కొరాపుట్ జిల్లాలోని దమంజోడిలో శనివారం గ్యాస్ సిలీండర్ల లోడుతో వెళ్తున్న లారీ బైక్‌ని ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న మిర్చిమాల పంచాయతీ ఖంగుగుడ గ్రామానికి చెందిన ఖగుపతి జానీ(35) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని, రోడ్డుపైనే ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. దమంజోడి, సునాబెడా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ఆందోళనకారులకు సర్దిచెప్పారు. లారీ యజమానీ, గ్యాస్ ఏజెన్సీ నుంచి పరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కీలక సూత్రధారి అరెస్ట్

- గంజాయి విక్రయాల్లో నిందితుడు ఆంధ్రప్రదేశ్ వాసిగా గుర్తింపు



నిందితుడు రమణమూర్తి

జయపురం: గంజాయి కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌కు కారులో వెళ్తున్న ఇద్దరు యువకులు జయపురం సదర్ పోలీసులకు పట్టుబడగా.. ఇందులో కీలక సూత్రధారిని ఆంధ్రప్రదేశ్‌లో అరెస్ట్ చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల పోలీసు స్టేషన్ పరిధి పాడేరు గ్రామానికి చెందిన కె.రమణమూర్తి(24)గా గుర్తించారు. అతనిని కోర్టులో హాజరు పరిచిన అనంతరం సబ్ జైలుకు తరలించామన్నారు. అంతేకాకుండా అతడి ఆస్తులను సీజ్ చేసి, బ్యాంక్ ఖాతాను స్తంభింపజేశామని తెలిపారు. రాజస్థాన్‌కు చెందని ఇద్దరు యువకులు గంజాయి కొనేందుకు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తూ ఈనెల 1న సదర్ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. వారు గంజాయి సాగుకు ముందుగానే రమణమూర్తికి రూ.లక్ష అడ్వాన్సుగా ఇచ్చాడని నిందితులు అంగీకరించారు. వారు చెప్పిన ఆధారాల మేరకు పూర్తి వివరాలతో ప్రత్యేక పోలీసు బృందం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. అక్కడి పోలీసు అధికారుల సహకారంతో కీలక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు వివరించారు. అనంతరం బ్యాంక్ అకౌంట్ నుంచి లావాదేవీలను స్తంభింపజేశారు.



పర్యవేక్షిస్తున్న డీఐజీ రాజేష్, ఎస్పీ అనుభవ్

నాల్కోలో 5,801కిలోల గంజాయి ధ్వంసం

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని దమంజోడిలో ఉన్న భారత అల్యూమినియం కేంద్రం(నాల్కో)లో భారీగా గంజాయిని ధ్వంసం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని మెజిస్ట్రేట్ అనుమతితో సీజ్ చేసి, భద్రపరిచారు. ఈ నిల్వలు భారీగా పెరిగి పోవడంతో సమస్యలు పెరిగాయి. దీంతో కోర్టు అనుమతి మేరకు మేజిస్ట్రేట్ సమక్షంలో నిప్పంటించారు. కార్యక్రమాన్ని దక్షిణాంచల్ డీఐజీ రాజేష్ పండిట్, కొరాపుట్ ఎస్పీ అనుభవ్ శంకర్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.



గంజాయిని ధ్వంసం చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఎయిమ్స్‌ డైరెక్టర్‌



ఆలయంలో ఎయిమ్స్‌ డైరెక్టర్‌ త్రిపాఠి బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళగిరి ఎయిమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ముఖేష్‌ త్రిపాఠి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం స్థానిక వైద్యారోగ్యశాఖాధికారులతో కలిసి అరసవల్లి అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ను సందర్శించి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎయిమ్స్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ వంశీకృష్ణ రెడ్డి, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్‌ ఎస్‌.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ వెళ్లి.. పింఛన్‌ అందించి..



ఎంఛన్‌ అందజేస్తున్న వలంటీర్‌ గిరీష్‌

టెక్కలి: టెక్కలి మేజర్‌ పంచాయతీ గ్రామ సచివాలయం-1కు చెందినవలంటీర్‌ యర్నాగుల గిరీష్‌ హైదరాబాద్‌ వెళ్లి పింఛన్‌ అందజేశారు. టెక్కలి రేవతిపతి వీధికి చెందిన ఉప్పాడ రామారావు దివ్యాంగుడు. ఆయన భార్య ఉప్పాడ పార్వతిదేవి వృద్ధురాలు. అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. పింఛన్‌ అందజేసే సమయం కావడంతో గ్రామ వలంటీర్‌ గిరీష్‌ హైదరాబాద్‌ వెళ్లి ఇరువురికి పింఛన్లు అందజేశారు.

జీడితోటలు దగ్ధం



కాలిపోయిన జీడితోట

సంతబొమ్మాళి: మండలంలోని ఆకాశలక్కవరం పంచాయతీ సీరపువానిపేట పరిధిలో శనివారం జీడితోట దగ్ధమైంది. 50 సెంట్ల తోట కావడంతో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. స్థానికులు నీటి ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మేఘవరంలో 10 ఎకరాల జీడితోట దగ్ధం కాగా సుమారు రూ.20లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. వ్యవసాయాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పన్ను బకాయిలు చెల్లించండి

ఆమదాలవలస: పురపాలక సంఘానికి బకాయి పడిన పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విశాఖపట్నం రీజియన్‌ పురపాలక ప్రాంతీయ సంచాలకుడు పి.నాగరాజు కోరారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆమదాలవలస మున్సిపల్‌ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న పన్నుబకాయిలతో అభివృద్ధికి విఘాతం కలుగుతోందన్నారు. వేసవి తాగునీటి ఎద్దడిపై తీసుకోనున్న కార్యాచరణను మున్సిపల్‌ కమిషనర్‌ కె.అప్పలనాయుడుని అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, వీధిలైట్ల నిర్వహణ పక్కాగా చేపట్టాలని, ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై విమర్శలకు తావులేకుండా నిబంధనల మేరకు చ ర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక కంపోస్ట్‌ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ బి.సృజన తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.1270 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ షేక్‌ మహమ్మద్‌ అలీ తెలిపారు. వీరిని అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

బూర్జ : నీలాదేవిపురం గ్రామానికి చెందిన జమ్మాన ప్రసన్నకుమార్‌ ఓవీపేట పరిధిలోని తో టలో అనుమానాస్పద రీతిలో మృతి సంగతి తెలిసిందే. పోలీసులు 11 మంది అనుమానితులను విచారించి ఓవీపేటకు చెందిన అన్నెపు రమణమూర్తి ని నిందితుడిగా గుర్తించారు. దిశ డీఎస్పీ ఎస్‌.వాసుదేవరావు ఆధ్వర్యంలో శనివారం అదుపులోకి తీసుకుని జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపర్చినట్లు బూర్జ ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. కోర్టు రిమాండ్‌ విధించిందని పేర్కొన్నారు.

‘మెనూ అమలు చేయడం లేదు’

పాతపట్నం: తెంబూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ సరిగ్గా అమలు చేయడం లేదని విద్యార్థులు ఏబీవీపీ కన్వీనర్‌ కే.మురళి అన్నారు. శనివారం తెంబూరు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ విషయమై హెచ్‌ఎం ఎ.రమేష్‌ను వివరణ కోరగా టెన్త్‌ విద్యార్థులకు అదనపు తరగతులు పెడుతున్నందున కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

కొనసాగిన నిరసనలు

- ఎస్పీ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకుల భైఠాయింపు



బరంపురం: ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించిన నాయకులు



నవరంగ్‌పూర్‌లో ర్యాలీగా వెళ్తున్న బీజేపి నాయకులు



ఎస్పీ శరవన్‌ వివేక్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



ఎస్పీ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నిత్యానంద



భువనేశ్వర్‌: కమిషనరేట్‌ ఎదుట బీజేపీ కార్యకర్తల ఆందోళన

పర్లాకిమిడి: భువనేశ్వర్‌లో ఫిబ్రవరి 28న బీజేపీ యువమోర్చా నాయకులు, పోలీసుల మధ్య చోటు చేసుకున్న దాడి కేసులో 22మందిని అరెస్ట్‌ చేశారు. దీనిని నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా పర్లాకిమిడి లోని ఎస్పీ కార్యాలయం ఎదుట యువమోర్చా నాయకులు బాలకృష్ణ పాత్రొ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పోలీసులు పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించు కోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డీఎస్పీ వామదేవ్‌ సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఆందోళనలో బీజేపీ యువమోర్చా కార్యవర్గ సభ్యులు బబునా బెహరా, సాధారణ కార్యదర్శి ఈ.ప్రశాంత్‌, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, జగన్నాథ మహాపాత్రొ, కాశీనగర్‌ సమితి మాజీ అధ్యక్షుడు ఛిత్రి సింహాద్రి, దారపు చిట్టి, కోట్ల యువరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యతిరేకంగా నిరసనలు..

బరంపురం: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని బీజేపీ నాయకులు విమర్శించారు. తమ పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించు కోవాలని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు బరంపురం ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సబతి పండా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. యువమోర్చా నాయకులపై పోలీసుల దాడిని అంతా ఖండించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగిపోయాయని, అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్నాయని ఆరోపించారు. వెంటనే సీఎం నవీన్‌ తన పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఎస్పీ శరవణ్‌ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో యువజన మోర్చా జిల్లా కార్యదర్శి ఎస్‌.రాజేంద్ర, నాయకులు బికాష్‌, సుభాషిని సాహు, కన్ను చరణ్‌ పతి, కుందిలి పాత్రొ, రాణి, మధన్‌మోహన్‌ పాత్రొ, మోహన్‌దాస్‌, ప్రభాత్‌ సడంగి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేయాలి..

కొరాపుట్‌: నవరంగ్‌పూర్‌ జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని బీజేపీ శ్రేణులు ముట్టడించాయి. ముందుగా ర్యాలీ నిర్వహించిన నాయకులు.. భువనేశ్వర్‌లో తమ పార్టీ నాయకులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇప్పటికీ బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ ఘటనపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయని విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్పీ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఆందోళనలో ఉమ్మర్‌కోట్‌ ఎమ్మెల్యే నిత్యానంద గోండో, పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌ బిసోయి, సీనియర్‌ నాయకుడు గౌరీశంకర్‌ మాఝి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర్‌ కమిషనరేట్‌ వద్ద..

భువనేశ్వర్‌: కమిషనరేట్‌ పోలీసులు ఉద్దేశ పూర్వకంగా యువమోర్చా కార్యకర్తలపై అమానుషంగా దాడి చేసి గాయపరిచారని బీజేపీ విమర్శించారు. అక్రమ కేసులపై వ్యతిరేకంగా డీజీపీ, కటక్‌-భువనేశ్వర్‌ జంట నగరాల పోలీసు కమిషనరేట్‌ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నగర డీసీపీకి వినతిపత్రం సమర్పించారు.

ఉర్రూతలూగించిన స్వరానుభూతి



గీతాలాపనలో సంగీత కళాకారులు



కార్యక్రమాన్ని తిలకిస్తున్న అతిథులు

జయపురం: పట్టణంలోని జయనగర్‌ శిశు చిత్త వినోదిని కేంద్ర ప్రాంగణంలో స్వరఘుంజుర సంస్థ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన స్వరానుభూతి కార్యక్రమం శ్రోతలను ఉర్రూత లూగించింది. కార్యక్రమంలో చిన్నారులు, పెద్దలు పాల్గొని తమ సుమధుర గీతాలతో ఆకట్టుకున్నారు. హిందీ, ఒడియా పాటలతో మైమరపింపజేశారు. తొలిసారిగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ ప్రతిభను చాటుకున్నారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బహినీపతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సంగీతం పట్ల ప్రజలలో అవగాహన, ఉత్తమ అభిప్రాయం ఏర్పడుతుందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు ధీరేన్‌మోహన పట్నాయక్‌ను ప్రశంసించారు. అనంతరం కళాకారులను ఆయన సన్మానించారు.

మల్కన్‌గిరి చేరుకున్న వన దేవతామూర్తులు



తాగునీరు అందిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు



రహదారిలో పోలీసు బందోబస్తు



కన్యమారుు బోందో వద్ద పూజలందుకుంటున్న దేవతామూర్తులు



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో బొడా జాతర శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి 27న బయలుదేరిన వన దేవతామూర్తులు కన్నంరాజ్‌(కృష్ణుడు), బాల్‌రాజ్‌(అర్జునుడు), పోతురాజ్‌(భీముడు), మా ముత్యాలమ్మ శనివారం వేకువజామున జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఉన్న కన్యమారుు బోందోకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దేవతామూర్తులకు మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చారు. వచ్చిన భక్తుల సౌకర్యార్థం మల్కన్‌గిరి సత్యసాయి సేవాసమితి సభ్యులు తాగునీరు అందించారు. దేవతామూర్తులు మంగళవారం వరకు మల్కన్‌గిరి లోనే భక్తులకు దర్శనమిచ్చి మొక్కుబడులు స్వీకరిస్తారు. ఇందులో భాగంగా జాతర నాలుగు రోజులు మీనాబజార్‌(ఎగ్జిబిషన్‌)ను ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులు, పెద్దలు అహ్లాదకరంగా గడిపారు. ముందస్తు చర్యగా ప్రధాన రహదారుల్లో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పకడ్బందీగా ప్రాక్టికల్స్‌



శ్రీకాకుళంలో ఓ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీవీఈఓ ప్రకాశరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. రెండో విడతగా జిల్లాలో 76 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం, మధ్యాహ్నం 8142 మందికి గాను 7918 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు, ఇంటర్మీడియెట్‌ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్‌ఐఓ ఎస్‌.తవిటినాయుడు, డీఈసీ కమిటీ సభ్యులు, హెచ్‌పీసీ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు కేంద్రాల్లో తనిఖీలు జరిపారు. సీసీ కెమెరాల స్ట్రీమింగ్‌ ద్వారా బోర్డు ఉన్నతాధికారులు, ఆర్‌ఐఓ కార్యాలయంలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

తెగుళ్ల నివారణ కీలకం



రామజోగిపేటలో పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్‌: వ్యవసాయం లాభసాటి కావాలంటే మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలని, తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని ఆమదాలవలసకు చెందిన కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మౌనిక అన్నారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరం పంచాయతీ రామజోగిపేటలో శనివారం వైఎస్సార్‌ పొలంబడి నిర్వహించి పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్ర పురుగుల రక్షణపై దృష్టి సారించాలన్నారు. పంటలో పసుపు పళ్లేలు ఏర్పాటు చేయడంవల్ల శత్రుపురుగ్లును నియంత్రించవచ్చునని చెప్పారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ ఏడీఏ బి.రజని, రైతు శిక్షణ కేంద్రం ఏఓ సూర్య కుమారి, మండల వ్యవసాయాధికారి వై.సురేష్‌, ఏఈఓ దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతానికి ప్రత్యేక విద్యుత్‌ సెక్షన్‌


అరసవల్లి: జిల్లాలో ప్రధాన పారిశ్రామిక వాడగా గుర్తింపు ఉన్న పైడిభీమవరంలో విద్యుత్‌ పరమైన సమస్యలకు ఇకమీదట చెక్‌ పడనుంది. ఈ మేరకు ఇక్కడ కొత్తగా విద్యుత్‌ శాఖ సెక్షన్‌ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తూ తూర్పు ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ కార్పొరేట్‌ కార్యాలయ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 20కి పైగా భారీ ఫార్మా పరిశ్రమలు, ఇతరత్రా కంపెనీ కార్యాలయాలున్న ఈ ప్రాంతంలో విద్యుత్‌ డిమాండ్‌ అధికంగా ఉన్న కారణంగా పైడిభీమవరం కేంద్రంగా కొత్తగా సెక్షన్‌ ఏర్పాటు చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో ఈ ప్రాంతంలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో పైడిభీమవరం సెక్షన్‌ ఏర్పాటుతో మొత్తం 44 సెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాతర్లపల్లి, పైడిభీమవరం, కోష్ట సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్‌ వినియోగదారులకు ఈ కొత్త సెక్షన్‌ సేవలందించనుంది. దీనిపై విద్యుత్‌ సర్కిల్‌ ఎస్‌ఈ ఎల్‌.దైవప్రసాద్‌ మాట్లాడుతూ.. పైడిభీమవరానికి కొత్త సెక్షన్‌ మంజూరైందని, ఇక్కడ ఏఈ పోస్టును కూడా భర్తీ చేశామని స్పష్టం చేశారు.

లెక్కల చిక్కులు తేలుస్తూ..!



గణిత దశావధానం ప్రక్రియలో పాల్గొన్న అవధాని మద్దు తిరుపతిరావు

- గణిత బోధనలో రాణిస్తున్న మద్దు తిరుపతిరావు మాస్టారు
- విద్యార్థుల్లో మ్యాథ్స్‌పై భయం పోగొట్టేందుకు కృషి
- రాష్ట్ర వ్యాప్తంగా 205 చోట్ల గణిత అవధాన ప్రదర్శనలు



150 సంవత్సరాల క్యాలెండర్‌

కంచిలి: సాధారణంగా విద్యార్థులకు లెక్కలంటే భయం. మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తున్నా.. గణితంలో మాత్రం లేనిపోని ఆందోళనతో వెనుకబడిపోతుంటారు. ఇలాంటి వారిలో భయం పోగొట్టేందుకు, సులువుగా గణిత సమస్యలు అర్థమయ్యేలా చిట్కాలను కనుగొని తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన మద్దు తిరుపతిరావు మాస్టారు. ప్రస్తుతం జలంత్రకోట పంచాయతీ చౌత్రాయిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఖాళీ సమయాల్లో గణిత అవధాన ప్రక్రియ ప్రదర్శనలిస్తూ గణిత సేవలో తరిస్తున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తిరుపతిరావు మచిలీపట్నంలోని ఏజే కళాశాలలో బీఈడీ చదువుతున్నప్పుడు అక్కడి ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డి.ఎస్‌.ఎన్‌.శాస్త్రి వద్ద శిష్యరికం చేసి గణితంపై పట్టు సాధించారు ఆయన వద్దే అవధాన ప్రక్రియ నేర్చుకున్నారు.

అనేక అవార్డులు..



పాగిరిలో నిర్వహించిన దశావధానం ప్రక్రియకు గుర్తుగా జ్ఞాపిక

- తిరుపతిరావుకు నియోజకవర్గ స్థాయిలో ‘జ్ఞానదీప్తి’ అవార్డు, గణిత చాణుక్య అవార్డు, గణిత మిత్ర అవార్డులు వరించాయి. 5 వేల సంవత్సరాల క్యాలెండర్‌ను రూపొందించి గిన్నిస్‌బుక్‌ ఆఫ్‌ రికార్డుకు పంపించగా సభ్యత్వాన్ని కేటాయించారు.
- దివంగత సర్దార్‌ గౌతు లచ్చన్న స్మారక అవార్డును అప్పటి మాజీ కేంద్ర మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు చేతులమీదుగా అందుకున్నారు.
- ఇటీవల మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు చేతులమీదుగా 10 సంవత్సరాల క్యాలెండర్‌ను ఆవిష్కరించి, అభినందనలు అందుకున్నారు.

గణిత అవధానం అంటే..

తెలుగు అవధానం మాదిరిగానే గణితావధానం ప్రక్రియ ఉంటుంది. ఇందులోనూ 8 మంది పృచ్ఛకులు ఉంటారు. వీరు అడిగిన ప్రశ్నలకు అవధాని టక్కున సమాధానం చెబుతుంటారు. గణిత శాస్త్రంలో అపరిమితమైన ప్రశ్నలకు చమత్కారంగా, వేగంగా సమాధానాలు చెబుతుంటారు. మూలాలు సాధన, సమస్యా పూరణం, పంచమ మూలకం, వారగణన, దత్తభిన్నాంకం, వర్గాల బేధంగా చెప్పడం, మనోగుణకారం వంటి వివిధ అంశాలు ఉంటాయి.


205 ప్రదర్శనలు..

తిరుపతిరావు అవధాన ప్రక్రియ నిర్వహిస్తూ విద్యార్థులను పృచ్ఛకులుగా తయారు చేసి ప్రదర్శనలివ్వడం ప్రారంభించారు. 8 అంశాలపైన గణిత అష్టావధానం, 10 అంశాలపైన గణిత దశావధానం, 12 అంశాలతో గణిత ద్వాదశావధానం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 205 ఉచిత ప్రదర్శనలిచ్చారు. దూరదర్శన్‌, వివిధ టీవీ చానల్స్‌లోనూ గణిత దశావధానం నిర్వహించారు.

వినూత్నంగా..

గణితంతో గారడీలు, గణిత విన్యాసాలు, గణిత క్రికెట్‌, గణిత వైకుంఠపాళి, గణిత గుర్తులతో తమాషా కథలు, గణిత గేయాలు, గణిత నాటికలు, అంకెలతో ఆటలు, మెదడుకు పదును,గణిత చిట్కాలు, విభిన్నం క్యాలెండర్లు తయారు చేయడంలో తిరుపతిరావు ప్రత్యేకత చాటుకుంటున్నారు. ప్రతి ఏడాది నూతన సంవత్సరం రోజున తాను తయారు చేసిన క్యాలెండర్లనే గ్రీటింగ్‌ కార్డుల మాదిరిగా శ్రేయోభిలాషులకు అందజేస్తుంటారు. శ్రీనివాస రామానుజన్‌ గణిత క్లబ్‌ను స్థాపించి జిల్లాస్థాయిలో గణిత ప్రతిభా పోటీలు, మండల స్థాయిలో గణిత పరిశోధన పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 9 మంది విద్యార్థులను బాలమేధావులుగా తయారు చేసి, వారితో ప్రదర్శనలు ఇప్పించారు.ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు డీఆర్‌పీగా వ్యవహరిస్తున్నారు.

గణితంపై భయం పోగొట్టడమే లక్ష్యం..



విద్యార్థుల్లో గణితం అంటే ఉన్న భయాన్ని దూరం చేయడమే లక్ష్యం. పది మంది బాలమేధావులను తీర్చిదిద్ది వారితో సైతం ప్రదర్శనలిస్తున్నాం. గణిత సమస్యలపై మరిన్ని పరిశోధనలు చేసి అందరికీ సులువుగా అర్థమయ్యేలా బోధన సాగిస్తాను.

– మద్దు తిరుపతిరావు, గణితావధాని, హెచ్‌ఎం, చౌత్రాయిపురం ప్రాథమికోన్నత పాఠశాల

క్లుప్తంగా

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం • కలెక్టర్ సూర్యకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: బాల్యవివాహాల నిర్మూలన, టీనేజ్ ప్రెగ్నెన్సీ రూపుమాపేందుకు కలెక్టర్ సూర్యకుమారి పిలుపునిచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె ఈ నెల ఏడో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 వేల మంది మహిళలతో భారీ మానవహారం చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ దగ్గరున్న ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆర్ అండ్‌బీ, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ, దాసన్నపేట, కోట జంక్షన్, సింహాచలం మేడ, ఆనంద గజపతి ఆడిటోరియం వరకు మానవహారం ఉంటుందన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో మహిళలంతా పాల్గొనాలని కోరారు.

ఏఎస్ఐపై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితుడు తవుడు

విజయనగరం క్రైమ్: స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పి.రామారావుపై దాడికి పాల్పడిన చింతలవలసకు చెందిన ఆటోడ్రైవర్ తవుడును పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ టి.వి.తిరుపతిరావు తెలిపారు. శనివారం అగ్రహారం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, అతడిని పట్టుకున్నామన్నారు. ఇటీవల ధర్మపురి రోడ్డు, మలిచర్ల సమీపంలో ఏఎస్ఐ సిబ్బందితో కలిసి ఓపెన్ డ్రింకింగ్, డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేస్తుండగా, మమ్మల్ని ప్రశాంతంగా మద్యం కూడా సేవించనివ్వరా అని తవుడు ఏఎస్ఐపై రాయితో దాడి చేశాడు. దీంతో ఏఎస్ఐ తలకు తీవ్రగాయమైంది. బాధిత ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో బొబ్బిలి కళాకారుడు


విశాఖ పారిశ్రామిక సదస్సులో వీణ వాయిస్తున్న కళాకారుడు లక్ష్మణస్వామి

బొబ్బిలి: విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో బొబ్బిలికి చెందిన కళాకారుడు లక్ష్మణస్వామికి గొప్ప అవకాశం లభించింది. రెండు రోజుల పాటు జరిగిన ఆ సదస్సులో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బొబ్బిలి వీణ వాయిద్య ప్రదర్శన ఇచ్చి, అందరి మన్ననలు పొందారు. అనంతరం వీణ తయారీ, గొప్పతనం వివరించారు. ఇదిలా ఉండగా, బొబ్బిలి దగ్గరలోని గొల్లపల్లి వీణల కేంద్రం తాత్కాలిక ఇన్‌చార్జిగా ఉన్న ఎస్.రామకృష్ణకు కేంద్రం ఇన్‌చార్జ్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ నియామకపత్రం ఆ సదస్సులో అందజేశారు.

పులిదాడితోనే ఎద్దు మృతి

మెంటాడ: మండలంలోని వాణిజ గ్రామ పంట పొలాల్లో పట్టబోయిన లక్ష్మికి చెందిన ఎద్దు పులిదాడివల్లే చనిపోయిందని అటవీశాఖ అధికారి కె.వి.ఎన్.రాజు స్పష్టంచేశారు. ఘటనా స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. పులిపాదముద్రలు సేకరించారు. ఈ ప్రాంతంలో పులి సంచరిస్తోందని, చీకటి పడిన తరువాత ఆరుబయట తిరగవద్దని హెచ్చరించారు. పులి జాడను తెలుసుకునేందుకు ఎద్దు మృతిచెందిన ప్రాంతంలో సీసీ కెమెరాలను అమర్చారు.

తప్పిన ప్రమాదం

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని నెల్లిమర్ల–రామతీర్థం రోడ్డులో స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం బొప్పడాం నుంచి విజయనగరం వైపు వస్తున్న ఓ ఆర్టీసీ బస్సు వంతెన దాటగానే ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే టాటాఏస్ వాహనం ముందు భాగం కాస్త ధ్వంసమైనట్లు డ్రైవరు తెలిపాడు.

నగదు చోరీ కేసులో మరొకరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: విజయనగరం బార్ అండ్ రెస్టారెంట్ యజమాని రాధాకృష్ణ వరప్రసాద్‌పై దాడికి యత్నించి, నగదు దోచుకుపోయిన ఘటనకు సంబంధించి, మరో నిందితుడు బెల్లాన బాలరాజును పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. 2023 జనవరిలో జరిగిన ఈ ఘటనలో పలువురు బార్ యజమానిపై దాడికి పాల్పడి, కౌంటర్‌లోని రూ.60,620 నగదు దోచుకుపోయిన సంగతి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే ఒకరిని అరెస్ట్ చేయగా, ఉదయం ద్వారపూడి బ్రిడ్జి సమీపంలో బాలరాజును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు పేర్కొన్నారు. నిందితుడి దగ్గర నుంచి రెండు వెండి ఉంగరాలు కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

మతసామరస్యానికి ప్రతీక..
సూఫీ సుగంధ మహోత్సవాలు

- బాబామెట్టలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు
- హజరత్ ఖాదర్‌వలీ బాబా దర్శనానికి పోటెత్తిన భక్తులు


బాబా దర్బార్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: స్థానిక బాబామెట్టలో హజరత్ ఖాదర్‌వలీ బాబా 64వ సూఫీ సుగంధ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల్లో మూడో రోజు అయిన శనివారం ప్రత్యేక నమాజ్‌లు చేశారు. బాబాను దర్శించుకునేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు భక్తులు పోటీపడ్డారు. దర్బార్ నిర్వాహకులు డాక్టర్ ఖలీల్‌బాబు కూడా బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం లంగర్ ఖానాలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. దీంతో బాబామెట్టలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

డిప్యూటీ స్పీకర్ పూజలు..

బాబామెట్టలోని హజరత్ ఖాదర్‌వలీ బాబాను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర ప్రజలకు మంచి సుపరిపాలన అందించేలా ఆశీర్వదించాలని బాబాను డిప్యూటీ స్పీకర్ వేడుకున్నారు. అంతకు ముందు హజరత్ అతావుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీ బాబా కుమారులు విజయనగరం ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డాక్టర్ ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీ(ఖలీల్‌బాబు), గులాం మహమ్మద్ జాఫర్ సాదిక్‌లు దర్బార్ సంప్రదాయం ప్రకారం కోలగట్లకు సాదర స్వాగతం పలికారు. విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు అవనాపు విక్రమ్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సీతం విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తదితరులు బాబాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.శ్రీనివాసరావు, జి.మురళి, వి.సత్యగౌరి, పైడితల్లి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.




బాబా దర్శనానికి వస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, పార్టీ నేత అవనాపు విక్రమ్

బాబా ఆశీస్సులు అందరిపై ఉండాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


బాబాను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: స్థానిక బాబామెట్టలో జరిగిన హజరత్ ఖాదర్‌వలీ బాబా 64వ సూఫీ సుగంధ మహోత్సవాలకు శనివారం జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు హాజరై, బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. బాబా ఆశీస్సులు అందరిపై ఉండాలని, రాష్ట్ర ప్రజలు నిత్యం బాగుండేలా దీవించమని వేడుకున్నారు. మతాలకు అతీతంగా బాబా దర్గాకు జనం తరలివచ్చి, పూజలు చేస్తుండడం చాలా గొప్ప విషయమన్నారు. అంతకుముందు దర్గా ధర్మకర్త డాక్టర్ ఖలీల్‌బాబు జెడ్పీ చైర్మన్‌కు సాదర స్వాగతం పలికారు.

గృహ హింస చట్టరీత్యా నేరం

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: మహిళలను గృహ హింసకు గురిచేయడం చట్టరీత్యానేరమని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు హెచ్చరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బాలికల కళాశాలతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలు, యువతులపై జరుగుతున్న లైంగిక, యాసిడ్ దాడులు, బాలికల అపహరణ వంటి విషయాలు తెలిపి, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అలాగే మహిళలకు ఆస్తి హక్కు ఎలా పొందాలి, వేధింపులకు గురైన వారికి చట్టం ద్వారా ఎటువంటి రక్షణ ఉంటుంది, నిరాదరణకు గురైన భార్యలు ఎలా భరణం పొందవచ్చన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, జాతీయ మహిళా కమిషన్ రిసోర్స్ పర్సన్స్ డి.విజయలక్ష్మి, డి.సరళకుమారి, న్యాయవాదుల సంఘ ఉపాధ్యక్షుడు ఎస్.జయలక్ష్మి, న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, చల్లా శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఎస్ఐ వీబీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్రవేత్తల కృషి వెలకట్టలేనిది

- డీఆర్‌డీఏ విశ్రాంత శాస్త్రవేత్త రాఘవేంద్రరావు


డీఆర్‌డీఏ విశ్రాంత శాస్త్రవేత్త రాఘవేంద్రరావును సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకువచ్చేందుకు శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని డీఆర్‌డీఓ విశ్రాంత శాస్త్రవేత్త, ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజీ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు పి.రాఘవేంద్రరావు అన్నారు. శనివారం స్థానిక కంటోన్మెంట్ గురజాడ విద్యాసంస్థల్లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నేటితరం విద్యార్థులంతా భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్, విశదీకరించిన ప్లాస్టిక్ రసాయన సమ్మేళనాలు సైన్స్ రంగానికే వన్నె తెచ్చాయన్నారు. సైన్స్ లేని జీవితం ఊహించలేమని, ప్రతీది సైన్స్‌తోనే ముడిపడి ఉందన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు గురుప్రసాద్ తదితరులు రాఘవేంద్రరావును సన్మానించారు.

ఆస్పత్రి నుంచి 9 మంది డిశ్చార్జి

విజయనగరం ఫోర్ట్: ఘోషాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలసదన్‌కు చెందిన 12 మంది పిల్లల్లో 9 మంది పూర్తిగా ఆరోగ్యం కోలుకుని, శనివారం డిశ్చార్జి అయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిగతా ముగ్గురి ఆరోగ్యంపై చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులు శనివారం ఆస్పత్రి సందర్శించి, ఆరాతీశారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

కమనీయం.. వేణుగోపాలుని కల్యాణం


పుష్పగిరిలో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న వేదపండితులు

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం శుక్రవా రం రాత్రి కనుల పండువగా జరిపారు. వేదపండితులు వేడుగోపాలుడు, రుక్మిణి, సత్యభామ ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించా రు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం సీతరామచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన సాగింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కొత్తవలస: మృతి చెందిన అప్పారావు

పాచిపెంట: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండల కేంద్రంలోని కురాకుల వీధికి చెందిన కోట యర్రయ్య శనివారం మృతి చెందాడు. ఫిబ్రవరి 24వ తేదీన మాత్రలు సేవించడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను చికిత్స నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రి, ఆ తర్వాత విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అయితే కేజీహెచ్‌లోనే చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కృపారావు వెల్లడించారు.

చెట్టు పైనుంచి జారిపడిన వ్యక్తి..

కొత్తవలస: చెట్టు పైనుంచి జారిపడి తీవ్రగాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దంగ అప్పారావు(70) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి చనిపోయినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు శనివారం తెలిపారు. మండలంలోని ఎగుఎర్రవానిపాలెం గ్రామానికి చెందిన అప్పారావు శుక్రవారం ఉదయం చీడివలస గ్రామంలో చింతబొట్టల కోసం చెట్టు ఎక్కాడు. ప్రమాదశాత్తు కాలుజారి కిందపడడంతో అతడికి తీవ్రగయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

వృద్ధుడి సజీవదహనం


ఘటన స్థలంలో వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాడంగి: వృద్ధుడు దూసి దువ్వయ్య(80) సజీవదహనమైన ఘటన మండలంలోని వాడాడ గ్రామంలో విషాదం నింపింది. తన పొలంగట్టుపై ఉన్న తుప్పలకు అంటించిన నిప్పంటుకుని అతడు కాలిపోయి చనిపోయాడు. ఈ నెల ఒకటో తేదీన పెన్షన్ తీసుకునేందుకు బొబ్బిలి నుంచి స్వగ్రామానికి వచ్చిన అతడు ఒకసారి పొలం ఎలా ఉందో చూసొద్దామని వెళ్లాడు. పొలం గట్లపై పిచ్చిమొక్కలు ఎక్కువగా పేరుకుపోవడంతో వాటిని తగలబెట్టేందుకు నిప్పంటించాడు. ఈ క్రమంలో బాగా గాలి వీయడంతో అక్కడే ఉన్న అతడి బట్టలకు అగ్గి అంటుకుంది. మంటల మధ్య చిక్కుకున్న అతడి శరీరం పూర్తిగా కాలిపోయి చనిపోయాడు. మామ బొబ్బిలి వెళ్లిపోయి ఉంటాడని భావించిన అతడి కోడలు శనివారం ఉదయం ఉపాధి పనులకు వెళ్తుండగా, ఆమె మామ కాలిపోయి చనిపోయిన విషయాన్ని పొలానికి వెళ్లి చూసిన కొంతమంది గ్రామస్తులు ఆమెకు చెప్పారు. ఘటన స్థలానికి చేరుకున్న ఆమె చనిపోయిన వ్యక్తి తన మామగానే గుర్తించి, కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పొలంలోనే పోస్టుమార్టం చేయించి, బంధువులకు మృతదేహం అప్పగించారు.

24 గంటలూ వైద్య సేవలు

దత్తిరాజేరు/బొండపల్లి: పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.రమణకుమారి ఆదేశించారు. దత్తిరాజేరు, బొండపల్లి పీహెచ్‌సీల ను శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆస్పత్రి రికార్డులు, మందుల నిల్వలు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రులకు కావాల్సిన సదుపాయాలపై వైద్యులు ఆనంద్‌కుమార్, సతీష్, ఎల్.సత్యనారాయణ, రాజ్‌గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్లలోఖాళీ స్థలాలకు టెండర్లు

విజయనగరం టౌన్: జిల్లాలోని బొబ్బిలి, చీపురుపల్లి, ఎస్.కోట బస్‌స్టేషన్లలో ఉన్న షాపులు, ఖాళీస్థలాలను ఐదేళ్ల కాలపరిమితికి అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు కోరుతున్నట్లు ప్రజారవాణా అధికారి కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14వ తేదీలోపు కార్యాలయంలో ఉన్న టెండర్ బాక్సులో దరఖాస్తులు వేయాలన్నారు. మరిన్న వివరాలకు ఫోన్ నంబర్లు 9959225620, 9959225619ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఐటీ రంగంలో ఫ్రెషర్స్‌కు మంచి అవకాశాలు

- టెక్ మహీంద్రా హెడ్, హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న టెక్ మహీంద్రా హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసులరెడ్డి

డెంకాడ: ఐటీ రంగంలో ఫ్రెషర్స్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని టెక్ మహీంద్రా హెడ్, హెచ్ఆర్ మేనేజర్ వి.శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జొన్నాడ దగ్గరున్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అంతర కళాశాలల యువజనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం, నైపుణ్య సాధన, భావవ్యక్తీకరణ లక్షణాలుంటే ఉన్నత లక్ష్యాలు అందుకోవచ్చన్నారు. సీసీసీ డిజిటల్ అధినేత ఉండవల్లి నాగవీర్ మాట్లాడుతూ చదువుతున్న సమయంలోనే ఇంజినీరింగ్ విద్యార్థులు సంబంధిత విభాగంలో జ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా టెక్నికల్ క్విజ్, హ్యాక్థాన్, కోడ్‌మేనియా, ల్యాండ్ గేమింగ్ పోటీలు నిర్వహించారు. వీటితో పాటు నిర్వహించిన వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ పోటీల్లో లెండి కాలేజీ విద్యార్థులతో పాటు ఎంవీజీఆర్, జీఎంఆర్ ఐటీ, రఘు, సెంచూరియన్, అనిట్స్ ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు కూడా పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు. సాయంత్రం ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, సీఎస్ఎస్ హెచ్‌ఓడీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ


పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ శత్పథి

బొబ్బిలి/బొబ్బిలి రూరల్: వందేభారత్ రైళ్ల రాకపోకలకు అనుగుణంగా రైల్వే ట్రాక్‌లను ఈ ప్రాంతంలో నిర్మిస్తున్నామని రైల్వే డీఆర్ఎం అనూప్‌కుమార్ శత్పథి తెలిపారు. ఆజాదీకా అమృత్‌లో భాగంగా బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ట్రాక్, భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా రైల్వే ప్లాట్‌ఫామ్‌లు, మూడోలైన్ పనులు జరుగుతున్నాయని, నాలుగోలైన్ కూడా వేసే అవకాశం ఉందన్నారు. ట్రాక్ పరిశీలించనిదే సాలూరు రైలు బస్సుల పునరుద్ధరణపై స్పష్టతరాదన్నారు. బొబ్బిలి స్టేషన్‌ను ఆదర్శ స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. విశాఖ నుంచి విజయనగరం షటిల్ ట్రైన్లు నడుస్తున్నాయని, బొబ్బిలి వరకు పొడిగించాలన్న స్థానికుల వినతిని పరిశీలిస్తామన్నారు. బొబ్బిలి-శ్రీకాకుళం లైన్ ప్రతిపాదనలు ఏవీలేవని, స్టేషన్ పరిశుభ్రత బాధ్యత స్థానిక సిబ్బందిదేనని స్పష్టంచేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, అంబేడ్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోరుసాంబయ్యలు డీఆర్ఎంను కలిసి పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఆయన వెంట జీఎం నరసింహారావు, ఏడీఆర్ఎం సుధీర్‌గుప్తా ఉన్నారు.

అన్నిరంగాల్లోనూ రాణించాలి

విజయనగరం రూరల్: మహిళలు అన్ని రంగా ల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మికుమారి పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహి ళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకు ని ధర్మపురి సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అన్నిరకాల రిజర్వేషన్లు కల్పిస్తున్నా విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలు వెనకంజలోనే ఉన్నారన్నారు. ఆడపిల్లలకు అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బంగార్రాజు, మహిళా రిసోర్సుపర్సన్ పీవీ వరలక్ష్మి, ఏఎస్సై లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

విద్యలనగరంలో మిల్కీబ్యూటీ సందడి

- మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభం



విజయనగరం టౌన్: మిల్కీబ్యూటీ తమన్నా భాటియా విజయనగరంలో సందడి చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డు ఫోర్ట్ సిటీ సెంట్రల్ మాల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం షాపులో ఉన్న డైమండ్ నగలను పరిశీలించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ భారతదేశంలోనే అతి పెద్ద బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో మలబార్ ఒకటని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 16వ షోరూమ్ విజయనగరంలో ఏర్పాటుచేయడం గర్వకారణమన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహమ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల నుంచి వస్తున్న స్పందన చాలా బాగుందన్నారు. అగ్రశ్రేణి, ప్రత్యేకమైన జ్యూయలరీ షాపింగ్ అనుభూతిని ఆస్వాదించేందుకు ఆభరణాల ప్రేమికులను స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

సందడి చేసిన తమన్నా...

మిల్కీ బ్యూటీను చూసేందుకు విజయనగరం యువత ఎగబడ్డారు. గంటల కొలది వేచిచూశారు. తమన్నా అభివాదం చేసిన వేళ కేరింతలు కొట్టారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మహిళలకు గౌరవమర్యాదలు ఇవ్వాలని కోరారు. మీ మనసు చెప్పిందే వినాలంటూ మహిళలకు పిలుపునిచ్చారు. అభిమానులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. రాబోయే కొత్తచిత్రం బోళా శంకర్‌తో పాటు పలు చిత్రాల్లో నటిస్తున్నట్లు తెలిపారు. బబ్లీబౌన్సర్‌లా కొత్త కొత్త క్యారెక్టర్లను ఎంపిక చేసుకుంటున్నట్టు వెల్లడించారు.



తమన్నాను చూసిన వేళ యువత కేరింత (ఇన్‌సెట్లో) మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, సినీనటి తమన్నా, ఎంపీ బెల్లనాచంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, షోరూమ్ యజమానులు